ప్రజాశక్తి
శుక్రవారం 6 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



### నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం కేంద్రంగా 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం బీచ్ రోడ్‌లోని వైఎంసిఎలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని గీతం యూనివర్సిటీ వేదికగా ఈ నెల ఆరు నుండి 12వ తేదీ వరకు జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని పలు జిల్లాలకు చెందిన 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటారని చెప్పారు. వారం రోజులపాటు జరిగే ఈ గిరిజన యువ సమ్మేళనంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రధానంగా గిరిజన సంస్కృతి, ఆచారపు అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయని ఆయన వివరించారు.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ సహకారాలతో దీన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

# ఉద్యమ స్ఫూర్తి.. చైతన్య దీప్తి




మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర. పక్కన శ్రీనివాసరావు, లోకనాథం, అప్పలనర్స

**ప్రజాశక్తి - పాడేరు, పాడేరు టౌన్ విలేకరులు**

జిల్లా కేంద్రం పాడేరులో రెండు రోజులపాటు జరిగిన సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభ గురువారంతో విజయవంతంగా ముగిసింది. తొలి రోజు భారీ ర్యాలీ, బహిరంగ సభతో పాటు రెండు రోజుల పాటు స్థానిక కాఫీ హౌస్ (సీతారాం ఏచూరి నగర్)లో నిర్వహించిన ప్రతినిధుల సభ పార్టీ శ్రేణుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపింది. ఆద్యంతం ఈ మహాసభ సమరోత్సాహంతో సాగింది. రెండో రోజైన గురువారం స్థానిక కాఫీ హౌస్‌లో సిపిఎం జెండా ఆవిష్కరణతో ప్రతినిధుల సభ మొదలైంది. పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, కె.సురేంద్ర, జిల్లా కార్యదర్శి అప్పలనర్సతో సహా అందరూ నివాళ్లర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమై నివేదికలపై సాగింది. ప్రాంతాలవారీగా, రంగాలవారీగా ప్రతినిధులు మాట్లాడారు. ఈ క్రమంలోనే జిల్లా సమగ్రాభివృద్ధిపై తీర్మానాలు చేశారు. చివరిగా పార్టీ జిల్లా కమిటీని 19 మందితో ఎన్నుకున్నారు. రెండో రోజు ప్రారంభోపన్యాసం కె.లోకనాథం, ముగింపోపన్యాసం వి.శ్రీనివాసరావు చేసి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

**గిరిజన సమస్యల పరిష్కారానికి ఉధృత పోరాటాలు**

అల్లూరి జిల్లాలో ఆదివాసీలకు బాసటగా ఉధృత పోరాటాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో పర్యటించి, సదస్సులు పెట్టి, గిరిజనుల సమస్యలను గుర్తించి సమర శంఖాన్ని పూరించాలన్నారు. ప్రజలపై రుద్దుతున్న బిజెపి మతోన్మాదాన్ని వ్యతిరేకించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ప్రజా ఉద్యమాల ద్వారా జిల్లాలోని ఆదివాసీలకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. కేంద్ర బిజెపి రాజ్యాంగంపై దాడి చేస్తోందన్నారు. మోడీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడేవిగా ఉన్నాయని విమర్శించారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ఆర్థిక విధానాలు గిరిజన ప్రాంతాల మనుగడపై ప్రభావం చూపిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో గిరిజన హక్కులను, చట్టాలను పరిరక్షించుకొని ఆదివాసీ సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు రూపకల్పన చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచి 2029 నాటికి జిల్లాలో పెద్ద పార్టీగా సిపిఎం అవతరించే విధంగా పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. బిజెపి నియంతృత్వం దేశంలో పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్, చంద్రబాబుల పాలనా విధానాల్లో వ్యత్యాసమేమీ లేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ పాడేరులో సిపిఎం అనుబంధ రంగాల కార్యాలయానికి మద్రి కామయ్య పేరుతో భవనం నిర్మించుకోవాలని, దీనికి జిల్లాలోని పార్టీ శ్రేణులంతా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు, నాయకులు వివి.జయ, ఎస్.హైమావతి, పాలికి లక్కు, సుందరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



తీర్మానాలను చేతులెత్తి ఆమోదిస్తున్న ప్రతినిధులు




మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

**ఆకట్టుకున్న డప్పుల పదర్శన, పాటలు**

జిల్లా మహాసభ సందర్భంగా ప్రజానాట్యమండలి, జానపద వృత్తి కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు, పాటలు ఆకట్టుకున్నాయి. డప్పుల దరువులతో, ఉద్యమ పాటలతో పాలకుల తప్పిదాలను ప్రశ్నిస్తూ, ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎండగడుతూ కళాకారులు గళమెత్తారు.

## 20 తీర్మానాలు ఏకగ్రీవ ఆమోదం

జిల్లాలోని కీలక సమస్యలు, అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అవరోధాలు, రాజకీయ, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక అంశాల్లో రాజకీయ విధానం, భవిష్యత్తు పోరాట లక్ష్యాలు వంటి అంశాలపై మహాసభ సుదీర్ఘంగా చర్చించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలపై పడుతున్న భారాలు, ప్రజాస్వామిక హక్కులపై జరుగుతున్న దాడులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం గిరిజన చట్టాల సవరణ వంటి పలు అంశాలపైనా చర్చలు జరిగాయి. పాలక పార్టీలు ప్రజలను పట్టించుకోకపోవడం వల్ల వారి జీవనస్థితిగతులు మెరుగుపడడం లేదని, వారికి అండగా నిలబడి ప్రభుత్వంపై పోరాడటాన్నే ప్రథమ కర్తవ్యంగా తీసుకోవాలని సభ అభిప్రాయపడింది. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. అవి...

- షెడ్యూల్ ఏరియా ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో వంద శాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే చెందేలా చట్టం చేయాలి.
- తక్షణమే షెడ్యూల్ ఏరియాలో పీసా, అటవీ హక్కుల కమిటీల ఎన్నికలు నిర్వహించాలి. గ్రామసభకు పూర్తి అధికారం కల్పించాలి.
- నాన్ షెడ్యూల్ ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి.
- అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలి.
- కాఫీ బకాయిలు చెల్లించాలి. కాఫీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- పిఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి
- ట్రైబల్ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి.
- గిరిజనులు పండిస్తున్న ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి జిసిసి ద్వారా కొనుగోలు చేయాలి. సంతల్లో మోసాలను అరికట్టాలి.
- ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి.
- 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి
- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. పరిహారం చెల్లించాలి.
- ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి. మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. మద్యం మత్తు పదార్థాలను నియంత్రించాలి.
- జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు రూ.10 వేల కోట్లు కేటాయించాలి.
- గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను అక్షయపాత్రకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలి.
- జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయాలి.
- జాతీయ రహదారి నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలి, నిర్వాసితులకు న్యాయం చేయాలి.
- సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలి. ఆదివాసీ విద్యార్థుల మరణాలను అరికట్టాలి. హెల్త్ వాలంటీర్లను నియమించాలి.
- అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. అర్హులైన గిరిజనులకు 10 ఎకరాల చొప్పున పోడుపట్టాలు మంజూరు చేయాలి. అటవీ హక్కుల పట్టాలు కలిగిన వారందరికీ 150 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలి.



అప్పలనర్స

### జిల్లా కార్యదర్శిగా పి.అప్పలనర్స ఎన్నిక - 19 మందితో జిల్లా కమిటీ

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శిగా తిరిగి పి.అప్పలనర్స ఎన్నికయ్యారు. 19 మందితో జిల్లా కమిటీ నూతనంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కిల్లో సురేంద్ర, వి.ఉమామహేశ్వరరావు, డి.గంగరాజు, బి.చిన్నయ్యపడాల్, కె.త్రినాథ్, ఎస్‌బి.పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులుగా బి.సన్నిబాబు, వివి.జయ, ఎస్.హైమావతి, ఎల్.సుందరరావు, కె.రామారావు, కె.బుజ్జిబాబు, ఎస్.సూరిబాబు, వి.మహేష్, పాలికి లక్కు, కె.మొస్య, వంతాల దాస్, పి.కుమారి ఎన్నికయ్యారు.




నూతన జిల్లా కమిటీతో సిపిఎం రాష్ట్ర నాయకులు

## మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

**ప్రజాశక్తి -సీలేరు:** మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనులు జీకే వీధిలో గురువారం ర్యాలీ చేపట్టారు. ఈనెల 2 నుంచి 8 వరకు పిఎల్‌జిఎ వారోత్సవాలను నిర్వహిస్తున్న మావోయిస్టులు, బంద్‌లు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు గురి చేయడం సరికాదని నినదించారు. ఆదివాసీల అభివృద్ధిని మావో యిస్టులు దూరం చేస్తున్నారని, అందుకే గిరిజన గ్రామాల్లో సమస్యలతో కూనరిల్లిపోతూ, అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు వారోత్సవాలు ఎందుకు, ఎవరి కోసం నిర్వహిస్తున్నారని, నిరాయుధులైన అమాయక గిరిజనులను చంపడం, అభివృద్ధి పనులను ధ్వంసం చేయడానికేనా అని ప్రశ్నించారు. అభివృద్ధిని అడ్డుకునే వారోత్సవాలు, మావోయిస్టుల స్థూపాలు తమకొద్దని నినదించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున గిరిజనులు వచ్చి, బ్యానర్లు పట్టుకుని ర్యాలీలో పాల్గొని మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జంక్షన్‌లో మానవహారంగా కార్యక్రమంలో గిరిజనులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీలేరులో నిర్వహిస్తున్న ర్యాలీ

## లింగ వివక్షతపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న మహిళా పోలీస్ రేవతి

**ప్రజాశక్తి -సీలేరు:** చిన్ననాటి నుండే ఆడపిల్లలను తల్లిదండ్రులు చదివించి సొసైటీకి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సచివాలయ మహిళా పోలీస్ రేవతి పిలుపునిచ్చారు. నేషనల్ జెండర్ క్యాంపెయిన్‌లో భాగంగా సీలేరు మేజర్ పంచాయతీ చింతపల్లి క్యాంపులో లింగ ఆధారిత వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలకు దూరంగా తమ పిలల్లను ఉంచేలా చర్యలు తల్లిదండ్రులు చర్యలుతీసుకోవాలని సూచించారు. సమాజంలో స్త్రీల పాత్ర గొప్పదని, చిన్నతనం నుంచే ఆడపిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకొవాని కోరారు. అనంతరం లింగఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కిముడు ఈశ్వరమ్మ, ఆయా చంప, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### భారీ నల్లత్రాచు హతం

**ప్రజాశక్తి- వై.రామవరం :** ఉపాధి పనికి వెళ్లే గిరిజనులకు ముళ్ళ పొదల్లో కనిపించిన భారీ నల్లత్రాచును మట్టుబెట్టారు. అపుడే పొర విప్పుతున్న దాన్ని చూసి భయాందోళనకు గురైన గిరిజనులు, అదిఎక్కడ కాటేస్తుందనే బెంగతో కొట్టి చంపేశారు. విషపూరిత పాము కావడంతో భయంతోనే ఇలా చేశామని గిరిజనులు అంటున్నారు.



మట్టుబెట్టిన పాముతో యువకుడు

## ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

### చింతూరు, రంపచోడవరం డివిజన్లలో 12 పోలింగ్ కేంద్రాల్లో 88.70శాతం ఓటింగ్ నమోదు

**పజాశక్తి రంపచోడవరం** : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని రంపచోడవరం సబ్ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల ఎఆర్‌ఒ కెఆర్.కల్పశ్రీ తెలిపారు చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని 12 పోలింగ్ స్టేషన్లలో 88.70 శాతం పోలింగ్ నమోదైందన్నాఉ. ఎటపాక మండలంలో 10 ఓట్లుండగా 10 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కూనవరంలో 41 మందికిగాను 40 మంది, చింతూరులో 37 మందికిగాను, 33 మంది, వి ఆర్ పురంలో 23 మందికిగాను 22 మంది, మారేడుమిల్లి మండలంలో 37 మంది ఉపాధ్యాయ ఓట్లుండగా 35 మంది, వై. రామవరం లోయర్‌లో 34ఉపాధ్యాయుల ఓట్లుండగా 27 మంది, వై.రామవరం అప్పర్‌లో 3 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా ముగ్గురూను, అడ్డతీగల మండలంలోని 98 మందికిగాను, 85 మంది, .రాజవొమ్మంగిలో 121 మంది ఉపాధ్యాయ ఓట్లుండగా 96 మంది, గంగవరంలో 51 మందికిగాను, 50 మంది, రంపచోడవరం మండలంలో 124 మందికిగాను, 110 మంది, దేవీపట్నంలో 58 మందికిగాను, 54 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని సబ్ కలెక్టర్ తెలిపారు. రెండు డివిజన్ల పరిధిలోని 12 పోలింగ్ కేంద్రాలలో 637 ఓట్లకు గాను 565 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోగా, 88.70 శాతం పోలింగ్ నమోదైందన్నారు. రంపచోడవరం జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. రంపచోడవరం తహశీల్దార్ రామకృష్ణ, డిటిలు సత్యనారాయణ, త్రిమూర్తులు, శ్రీధర్, శివ, ఆర్‌ఐ.జిలాని పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న లోతా రామారావు

**అడ్డతీగలలో 85 ఓట్లు పోలింగ్**

**అడ్డతీగల :** స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో 98 ఓట్లు గాను 85 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు మధ్యాహ్నం 12 గంటలకు తహశీల్దార్ సూర్యారావు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

**విఆర్.పురంలో 99శాతం ఓట్లు పోలింగ్**

**విఆర్ పురం:** స్థానిక జెడ్‌పి ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రంలో 23 ఓట్లుకు గాను 22 ఓట్లు పోలయ్యాయని 99 శాతం పోలింగ్ జరిగిందని.ఎన్నికల అధికారులు తెలిపారు మధ్యాహ్నం ఒంటి గంటకు చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్, ఎటపాక సిఐ కన్నప్ప, విఆర్ పురం తహశీల్దార్ సరస్వతి, పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద వైద్యశిబిరం నిర్వహణతోపాటు తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించారు. ఎంఆర్ఐ రామకృష్ణ, విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది, విఆర్.పురం, ఎస్ఐ సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది, రేఖపల్లి సెక్రటరీ శివప్రసాద్, సచివాలయం సిబ్బంది బుచ్చిరాజు,రేఖపల్లి డాక్టర్ ధనలక్ష్మి, ఆశ వర్కర్ అలివేలు, హెల్త్ అసిస్టెంట్ తదితరులు సహకరించారు.



దేవీపట్నంలో పోలీసుల భద్రతలో పోలింగ్ సిబ్బంది

**వై రామవరం** : స్థానిక ప్రాథమిక పాఠశాల నెలకొల్పిన ఆరో నెంబర్ పోలింగ్ కేంద్రంలో 34 ఓట్లుకుగాను 27 ఓట్లు పోలింగ్ అయ్యాయని ఎన్నికల అధికారులు వెల్లడింఆచరు. అప్పర్ డొంకరాయి సచివాలయంలో నెలకొల్పిన పోలింగ్ కేంద్రంలో మూడు ఓట్లకుగాను ముగ్గురూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఓటింగ్ తీరుపై ఆరా తీశారు తహశీల్దార్ వేణుగోపాల్, అడ్డతీగల సిఐ నరసింహమూర్తి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు

**దేవీపట్నం:** మండలంలోని ఇందుకూరుపేట జెడ్‌పి హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 58మంది ఓటర్లు గాను 54 ఓట్లు పోలింగ్ అయ్యాయి. 37మంది పురుషులు, 17మంది మహిళా టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని రంపచోడవరం సిఐ రవికుమార్, దేవిపట్నం ఎస్ఐ షరీఫ్ దేవీపట్నం తహశీల్దార్ సత్యనారాయణ పర్యవేక్షించారు



రంపచోడవరం కేంద్రంలో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఎఆర్ఒ, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

## ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు

### ఆకస్మిక తనిఖీ చేసిన ఐటిడిఎ పిఒ సింహాచలం

**ప్రజాశక్తి -రంపచోడవరం :** డివిజన్ కేంద్రమైన రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలు సమర్థవంతంగా రోగులకు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. గురువారం అసిస్టెంట్ కలెక్టర్ భావనతో కలిసి స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వివిధ రకాల భవనాలను పరిశీలించి, వేగవంతం చేయాలని ఆదేశించారు.

డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి, రోజువారీ, నెలకు ఎంతమంది కిడ్నీరోగులకు డయాలసిస్ చేస్తున్నదీ ఆరా తీశారు. ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు రావడానికి కారణాలపై వైద్యాధికారులను ఆరా తీశారు. ఇక్కడ గిరిజనులు నీరు ఎక్కువగా తాగరని, అలాగే ఉప్పు, కారం ఎక్కువగావేసిన ఆహార పదార్థాలను తింటారని, అందుకు కిడ్నీలు పాడౌతున్నాయని వైద్యులు వివరించగా, దానిపై పిఒ స్పందిస్తూ, ప్రతిరోజూ సగటున ఐదు లీటర్లు నీరు తాగేలా గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు.



ఆసుపత్రిలో సేవలపై వైద్యులను ప్రశ్నిస్తున్న పిఒ సింహాచలం

ప్రసూతి శిశు ఆరోగ్య నూతన భవనాన్ని పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో డ్రైనేజీ సిస్టం ఏర్పాటు, సెప్టిక్ ట్యాంకులు రెగ్యులర్‌గా పరిశుభ్రం చేయకపోవడం వల్ల నెలకొన్న ఇబ్బందులను ఆసుపత్రి సూపరెంటిండెంట డాక్టర్ టివి.శేషారెడ్డి పిఒ దృష్టికి తేగా, దీనికి సంబంధించిన ప్రతిపాదనను రూపొందించి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇబ్బందిలేకుండా వెంటనే వైద్యసేవలు అందించి, అవసరమైన మందులు ఇవ్వాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా విభాగాన్ని పరిశీలించి, ఎంతమంది వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు, ఉచిత మందులు అందిస్తున్నదీ వివరాలపై ప్రశ్నించారు. ఇన్‌పేషెంట్లకు ఎప్పటికప్పుడు తాజా ఆహారం అందజేయాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణం పరిశీలించారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహించినా, గిరిజన రోగుల నుంచి ఎటువంటి ఆరోపణలు తలెత్తినా శాఖాపరమైన చర్యలకు వెనకాడేది లేదని పిఒ హెచ్చరించారు. కార్యక్రమలో డాక్టర్ ప్రేమ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య,. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు మెటీరియల్‌ను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

## రోడ్డు పనులు పూర్తి చేయండి

### ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

**ప్రజాశక్తి- హుకుంపేట:** రహదారి నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మఠం జంక్షన్ ఆర్ అండ్ బి రోడ్డు నుండి మత్స్యగుండం ఆలయం వరకు రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులను గురువారం పరిశీలించారు. రహదారి పనుల్లో నాణ్యతను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరు లోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ టీ కొండయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

## ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు పర్యటన

**ప్రజాశక్తి -అనంతగిరి:** మండలంలోని బొర్రా, .కటికి గ్రామాల్లో ఎస్టి కమిషన్ చైర్మన్ డిజివి శంకర్రావు గురువారం పర్యటించారు.అనంతరం ఆ గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బొర్రాగేటు వలస మీదుగా కోనాపురం, కరాయిగూడ గ్రామాలకు రోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరుతూ ఎస్టి కమిషన్ మెంబర్ కొర్రా రామలక్ష్మి, స్థానిక సర్పంచ్ నాయకులు విన్నవించారు. అనంతరం బొర్రా బాలుర పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు డొంబు, రఘునాథ్, డానియల్, నవీన్, ఏటిడబ్ల్యుఒ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

## బోటు షికారు ప్రారంభం

**ప్రజాశక్తి-అరకులోయ:** గిరిజన మ్యూజియంలో నూతన బోట్ షికారును ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్. గురువారం ప్రారంభించారు. మ్యూజి యంలో పర్యటించిన ఆయన ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. తాగునీటి బాటిల్స్ ను మ్యూజియం లోపలికి అనుమతించవద్దని చెప్పారు. అనంతరం పద్మాపురం గార్డెన్లో పర్యటించి అక్కడ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాలను పరిశీలించారు. విద్యుత్ దీపాల ఏర్పాట్లను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం క్యూరేటర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు, ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.



బోటులో విహరిస్తున్న పిఒ అభిషేక్

# జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**ప్రజాశక్తి -పాడేరు:** జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులు చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ నుండి సబ్ కలెక్టర్లు, జాతీయ రహదారి అధికారులు, రహదారుల భవనాలు శాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారంపై ఆరా తీశారు. 516ఇ రహదారి నిర్మాణంలో సమస్యలు లేవని, అందరికి చెల్లింపు చేయడం జరుగుతోందని జాతీయ రహదారి అధికారులు వివరించారు. రంప చోడవరం, చింతూరు డివిజన్లలో జాతీయ రహదారి 30లో చిన్న చిన్న సమస్యలున్నాయని కొద్దిరోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు చెల్లింపులు చేయాలని సూచించారు. ఆర్ ఓఎఫ్ఆర్ భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి సబ్‌కలెక్టర్లు ప్రతిపాదనలు పంపించాలని దానిని ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ జాతీయ రహదారి, రహదారులు భవనాలు శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**పోస్టల్ సేవలు విస్తరించాలి**

**పాడేరు:** గిరిజన ప్రాంతంలో పోస్టల్ సేవలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ చెప్పారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో పోస్టల్ అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. 18 వేల మందికి ఇంకా ఆధార్ కార్డులు జారీ చేయవలసి ఉందన్నారు. పోస్టాఫీసుల ద్వారా కేంద్ర, రాష్ట్ర నగదు బదిలీ పథకాలు లబ్దిదారులకు అందించడానికి లబ్దిదారులకు పోస్టల్ ఖాతాలు ప్రారంభించాలని చెప్పారు.

కర్నూలు రీజన్ పోస్టు మాస్టర్ జనరల్ ఉపేంద్ర మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వం అనేక పోస్టల్ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఖాతాదారులు ప్రభుత్వ పథకాలు పొందడానికి ఖాతాలను మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. కిసాన్ సమ్మాన్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, ఆధార్ కార్డు నమోదు సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పోస్టల్ అధికారి కె. శ్రీనివాస్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వై.దిలీప్, సిపిఒ కె.ఎస్.ఆర్.కె. పట్నాయక్ పాల్గొన్నారు.

# తుపాన్‌తో పంటలకు తీవ్ర నష్టం



మొలకెత్తిన వరి పంటను చూపుతున్న రైతులు

**ప్రజాశక్తి-అనంతగిరి:** ఏడాది రైతుల కష్టార్జితం తుపానుతో నష్టాన్ని మిగిల్చింది. చేతికి అంది వచ్చిన వరి, రాజ్‌మా చిక్కుళ్ల పంట తుఫాన్‌కు దెబ్బతింది. మండలంలోని గత మూడు రోజుల క్రితం వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన తుఫాను ప్రభావంతో వరి, రాజ్‌మా, పప్పు దినుసులు తడిసి ముద్దయ్యాయి. వరి మొలకలు ఎత్తిన పరిస్థితి ఏర్పడింది.

మండలంలోని పెద్దబిడ్డ పంచాయితీ చెరుకుమడత గ్రామానికి చెందిన కె.చిన్నారావు అనే రైతు వరి పంట పూర్తిగా నానిపోయి మొలకలు ఎత్తింది. పలురు రైతుల వరి, చోడి వంటి పప్పు దినుసులు దెబ్బతిన్నాయి. నూర్పుల సమయంలో తుఫాన్ మొదలు కావడంతో ఎక్కడ పంటలు అక్కడే వదిలివేశారు. దీంతో పూర్తిగా నాని పంటలు దెబ్బతిన్నాయి. తక్షణమే ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# 7న పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశం

**ప్రజాశక్తి -పాడేరు:** జిల్లాలోని 3124 ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గురువారం విలేఖరులతో మాట్లాడారు. పేరెంట్స్, టీచర్ల మీట్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలపై చర్చించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులకు ఇప్పటికే సమాచారం అందించడం జరిగిందన్నారు. విద్యా వ్యవస్థలో ప్రమాణాల మెరుగు పరచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.జిల్లాలో 99 వేల మందికి సెప్టెంబరు, అక్టోబరులో బేస్ లైన్ ఎగ్జామ్ నిర్వహించడం జరిగిందన్నారు. 25 శాతం మంది పిల్లలకు తెలుగు, ఇంగ్లీషు, గణితంలో చదవడం, రాయడం రావడం లేదని గుర్తించామన్నారు. అనంతరం తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తారన్నారు.ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో విద్యార్థులకు సమగ్రమైన విద్యా ప్రగతి పత్రాలు (హొలిస్టిక్ కార్డులు) అందిస్తారని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఆయా పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇస్తారన్నారు. తక్కువ స్టార్ రేటింగ్ సాధించిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెడతారన్నారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలకు స్టార్ రేటింగ్ ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

**ముంచింగిపుట్టు :** మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం తల్లితండ్రులతో ఉపాధ్యాయుల సమావేశన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల ఎంఈఓ కృష్ణమూర్తి గురువారం తెలిపారు. విద్యార్థుల పురోగతిపై చర్చిస్తామన్నారు. ఈ మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్స్ 204 స్కూల్స్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

# నేరాలు ఘోరాలు

## చెట్టు పై నుండి పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి -నక్కపల్లి:** మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన అల్లు గంగరాజు (29) మేకల మేత కోసం వేప చెట్టు కొమ్మలు నరుకుతుండగా, ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి కింద పడి మృతి చెందినట్లు మృతుని భార్య అల్లు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. గురువారం అల్లు గంగరాజు, తన సోదరుడు నాగేశ్వరరావుతో కలిసి మేకల మేత కోసం గొడిచెర్ల శివారు ప్రాంతానికి వెళ్లారు. గంగరాజు వేప చెట్టు ఎక్కి కొమ్మలు కోస్తుండగా, ప్రమాదవశాత్తు తన చేతికి కత్తి తగలడంతో పెద్ద గాయం అయ్యింది. దీంతో గంగరాజు కిందన పడిపోయాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, సంఘటన ప్రాంతానికి చేరుకుని గంగరాజును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని భార్య దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ సన్నిబాబు సంఘటన ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## నేడు ఐక్య క్రిస్మస్

**ప్రజాశక్తి -హుకుంపేట:** మండలంలోని గూడా గ్రామంలో బీబీఎస్ చర్చి వద్ద ఈనెల 6న మండల పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వహించే ఐక్య క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని ఫెలోషిప్ అధ్యక్ష కార్యదర్శులు కే.బి సుధాకర్, కొర్ర ప్రేమ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. పాస్టర్లు సంఘ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## అగ్రిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-చింతపల్లి:** స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం అగ్రికల్చర్ ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు అగ్రిసెట్‌లో ప్రతిభ కనబరిచారు. పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న 16 మంది అగ్రిసెట్ పరీక్షకు హాజరు కాగా వారిలో ఐదుగురు అగ్రిసెట్ లో వివిధ ర్యాంక్ లతో ప్రతిభ కనబరిచారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో అగ్రికల్చర్ డిప్లమో పూర్తి చేసిన స్థానిక యువకుడు గుర్రం స్టీఫెన్ రాజ్ సహా మరో నలుగురు యువతులు అగ్రిసెట్ లో ప్రతిభ కనబరిచి ఏజీబీఎస్సీలో సీట్లు సాధించారన్నారు. చింతపల్లి మండలానికి చెందిన గుర్రం స్టీఫెన్ రాజ్ కు 11వ ర్యాంకు, గెడ్డం ఉమాలక్ష్మి ఎనిమిదవ ర్యాంకు, కంబిడి ప్రవల్లిక 27వ ర్యాంకు సాధించారన్నారు,

## ఖుర్దా డివిజన్‌లో పలు రైళ్ల రద్దు

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** ఖుర్దా రోడ్ డివిజన్‌లో 3వ లైన్‌ను ప్రారంభించేందుకు సంబంధించి భద్రక్ స్టేషన్‌లో ప్రీ నాన్-ఇంటర్‌లాకింగ్, నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 8వ తేదీన 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్, 10వ తేదీన 22853 షాలిమార్ - విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 22825 షాలిమార్- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 11వ తేదీన 22854 విశాఖపట్నం- షాలిమార్, 12868 పుదుచ్చేరి-హౌరా, 22826 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్, 12వ తేదీన 22874 విశాఖపట్నం-దిఘా, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 13వ తేదీన 22873 దిఘా-విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 14వ తేదీన 20889 హౌరా-తిరుపతి హంసఫర్, 12666 కన్యాకుమారి- హౌరా సూపర్ ఫాస్ట్, 15వ తేదీన 20890 తిరుపతి-హౌరా, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి, 12867 హౌరా-పుదుచ్చేరి, 22855 సంత్రాగచ్చి-తిరుపతి, 16వ తేదీన 12665 హౌరా- కన్యాకుమారి, 22856 తిరుపతి-సంత్రగచ్చి, 17వ తేదీన 22853 షాలిమార్ - విశాఖపట్నం, 12664 తిరుచ్చిరాపల్లి-హౌరా, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 22825 షాలిమార్- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్, 18వ తేదీన 12868 పుదుచ్చేరి-హౌరా, 22826 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- షాలిమార్, 19వ తేదీన 22854 విశాఖపట్నం- షాలిమార్, 12663 హౌరా-తిరుచ్చిరాపల్లి, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ లను రద్దు చేశారు.



వైద్యాధికారి పర్యవేక్షణలో కొలతలు తీస్తున్న ఆశాలు

## విద్యార్థులకు 'బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష'

**ప్రజాశక్తి - సీలేరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో విద్యార్థుల బరువు, ఎత్తు కొలతలను .ఆశా కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వలీ మాట్లాడుతూ ప్రతి చిన్నారి ఆరోగ్యరక్షలో భాగంగా వారికి తనిఖీలు చేశామని, వ్యాధులు, ఇతరత్రా అనారోగ్య సమస్యలుంటే సత్వర చికిత్స అందించడమే దీని లక్ష్యమన్నారు. పుట్టినప్పటి నుంచి 18ఏళ్లలోపు పిల్లలకు 44 రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. ప్రతి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో సంపూర్ణ ఆరోగ్యరక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బాలామణి, ఆశా వర్కర్లు సంగీత, కరుణామణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధికారులతో ఎంపిడిఒ సమీక్ష

**ప్రజాశక్తి - సీలేరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించారు. స్వర్ణ పంచాయితీ డేటా అప్‌డేషన్ వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఎంఎస్ఎంఎ సర్వే చేయాలని, స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా నిరుద్యోగ యువత వివరాలు సేకరించాలన్నారు. సచివాలయ సిబ్బంది అటెండెన్స్, ఎంపిసిఐ సర్వే, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో నాలుగు నెలల క్రితం చేపట్టిన 350 మరుగుదొడ్ల నిర్మాణపు పనులు పూర్తిచేయాలని తెలిపారు. 16 పంచాయతీల్లోని తాగునీటి ట్యాంకులు 15 రోజులకు ఒకసారి క్లీన్ చేయాలని, ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పాపారావు, హౌసింగ్ ఎఇఇ సెగ్గే సూరిబాబు ఇంజనీరింగ్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి- విఆర్.పురం:** మండలంలోని వడ్డేగూడెంలో అనారోగ్యంతో మృతి చెందిన ఓర్తుల సత్యవతి కుటుంబాన్ని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాలఖాన్ గురువారం పరామర్శించారు.జెకెసి ట్రస్ట్ తరపున రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ముత్యాల రామారావు, సర్ఫరాజ్ పాల్గొన్నారు.

**టిడిపి నేత రాజుకు పరామర్శ**

మండలంలోని రేఖపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నేత రాజును ఆయన నివాసానికి వెళ్లి గురువారం ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్ పరామర్శించారు కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, గొంది చంద్రయ్య,ెండ్డిమల్ల శ్రీనివాసరావు, మామిడి వంశీ, పాఠశాల చైర్మన్ శంకర్, సాల్మన్ రాజు, శ్రీరామ్ పాల్గొన్నారు.

**కుంతీదేవి ఉత్సవానికి బియ్యం వితరణ**

**కూనవరం** :మండలంలోని టేకులబోరు గ్రామంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న కుంతీదేవి ఉత్సవాన్ని గ్రామస్తుల ఆహ్వానం మేరకు డాక్టర్ జమాల్‌ఖాన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వహణలో తనవంతు సాయంగా 150కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సభ్యులు రియాజ్, నటరాజ్, అబ్రార్, టిడిపి నాయకులు సాల్మన్ రాజు, ముత్యాల శ్రీరామ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# కట్టు కథలు

- అనుమతుల్లేని ఔషధం తయారీ
- కళ్లు మూసుకున్న ఔషధ నియంత్రణ విభాగం
- ఠాగూర్ ఫార్మా ప్రమాదంపై వీడని మౌనం
- వాస్తవాలు దాచిపెడుతున్నారని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' విమర్శ



ఠాగూర్ లేబొరేటరీ (ఫైల్‌ఫొటో)

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలోని ఠాగూర్ ఫార్మా యాజమాన్యాన్ని ప్రభుత్వ యంత్రాంగం వెనుకేసుకొస్తోంది. రెండు నిండు ప్రాణాలు పోవడానికి, 27 మంది అస్వస్థతకు గురికావడానికి మూలమైన ఫార్మా యాజమాన్యంపై కఠిన చర్యలేమీ తీసుకోలేదు. ప్రమాదంపై యాజమాన్యం చెప్పిన కట్టుకథలే వినిపిస్తున్నారు తప్ప ప్రమాదానికి దారితీసిన వాస్తవాలు వెల్లడించడంలేదు. అనుమతుల్లేకుండా ఉత్పత్తుల తయారీపై కాలుష్య నియంత్రణ మండలి, ఔషధ నియంత్రణ విభాగం మౌనం ప్రదర్శిస్తున్నాయి. ప్రమాదనంతరమే ఔషధ పరిశ్రమల లోగుట్టు బయటపడుతున్నట్లే.. ఠాగూర్ ఉల్లంఘనలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. భద్రతనే కాదు, కొత్త ఉత్పత్తుల తయారీకి పాటించాల్సిన ప్రమాణాలు, నిబంధనలు కూడా పరిశ్రమాధిపతులు విస్మరిస్తున్నారు. లామివుడిన్ తయారీపై ఫ్యాక్టరీస్ అధికారుల దృష్టికి యాజమాన్యం తీసుకెళ్లలేదు. కొత్త డ్రగ్ తయారీపై ముందుగా ఈ విభాగానికి తెలియజేయాలన్న నిబంధన పాటించలేదు. ప్రమాదంపై కూడా సమాచారం సరిగా చెప్పలేదు. లామివుడిన్ ఉత్పత్తి చేస్తున్నట్లు బయటపడింది. అక్టోబర్‌లో ఠాగూర్ పరిశ్రమలో తనిఖీ అధికారుల బృందం పరిశీలించినప్పుడు అనేక లోపాలు గుర్తించింది. రియాక్టర్లకు ఎస్ఆర్‌విలు, రప్చర్ డిస్కులు వంటి రిలీఫ్ సిస్టమ్స్ ఏర్పాటుచేయాలని సూచించినా యాజమాన్యం పట్టించుకోలేదు. స్క్రబ్బర్ ఏర్పాటుచేస్తే ఒత్తిడికి లోనైన సందర్భంలో ప్రమాదాన్ని నియంత్రించవచ్చని డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ తెలిపారు.

ఠాగూర్ ఫార్మా ప్రమాదంపై ఔషధ నియంత్రణ విభాగం తమకేమీ సంబంధంలేనట్లు వుండడం విమర్శలకు తావిస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ అధికారులు ప్రమాదంపై భిన్నమైన కారణాలు చెప్పడంతో అనుమానాలకు తావిచ్చింది. వాస్తవాలు దాచిపెడుతున్నారన్న అభిప్రాయం కలిగింది. ప్రమాదంపై తప్పుదోవ పట్టిస్తున్నారని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' ప్రతినిధి డాక్టర్ కె.బాబూరావు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి కె.అనురాధ ప్రకటన జారీచేశారు. తరువాత ప్రమాదంపై పరిశీలన చేసినట్లు అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితిని ఔషధ నియంత్రణ విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ అధికారులు సంయుక్తంగాగానీ, వేర్వేరుగాగానీ తమ నివేదికల్లో బహిర్గతం చేయలేదు.

తాజాగా 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' బృందం ప్రతినిధులు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ ఎం.బాపూజీ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదం తరువాత ఫ్యాక్టరీ అధికారులూ, పిసిబి అధికారులు రియాక్టర్లలో వున్న మిశ్రమ నమూనా తీసుకొని పరిశీలించలేదు. లామివుడిన్ ఉత్పత్తి మూడో దశలో ప్రమాదం జరిగినట్లు ఫ్యాక్టరీస్ విభాగం తెలిపిందిగానీ ఏ విషవాయువో వివరించలేదు. పాంటోప్రజోల్ ఉత్పత్తి మూడో దశలో ప్రమాదం జరిగినట్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెప్పారు. క్లోరిన్ వాయువు అని చెబుతున్నారు. క్లోరిన్ వాసన సులువుగా గుర్తించవచ్చు. 0.02-3.4 పిపిఎం స్థాయిలో వాసన తెలుస్తుంది. క్లోరిన్ బయటకు వస్తున్నప్పుడు కార్మికులు బయటకు వెళ్లకుండా వుండరు కదా ? అని ప్రశ్నించారు. అసలు క్లోరిన్ ఎందుకు వచ్చింది ? పిసిబి అధికారులు క్లోరిన్ అని నిర్ధారణకు ఎలా వచ్చారు ? ఇదంతా కల్పిత కథలా వుంది. ఆ సమయంలో కంపెనీ డైరెక్టర్లు అక్కడ ఎందుకున్నారు ? క్లోరిన్ వాసన గుర్తించి జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదు. అనుమతిలేని కొత్త ఉత్పత్తి ప్రయత్నంలో జరిగిన ప్రమాదాన్ని కప్పిపుచ్చడానికి జరుగుతున్న ప్రయత్నంగా ఇదంతా వుంది. అధికారులు అందుకు సాధనంగా ఉపయోగపడుతున్నారు' అని వ్యాఖ్యానించారు. లోపాలను ఫ్యాక్టరీస్ అధికారులు గుర్తించి సరిచేయాలని సూచించినప్పటికీ మళ్లీ స్వతంత్రంగా వెళ్లి పరిశీలించే అధికారం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆ అవకాశం అధికారులకు లేకుండాపోయింది. పరిశ్రమల్లో భద్రత, ప్రమాణాల పరిశీలనకు ప్రభుత్వ విధానాలు అధికారులకు విఘాతం కల్గిస్తున్నాయి. పరిశ్రమల్లో భద్రత, ఉత్పత్తులు, కాలుష్య ప్రమాణాలపై ఆయా విభాగాల తనిఖీలకు ఆటంకంగా మారిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలోని అంశాలను ప్రభుత్వం తొలగించాల్సివుంది.

# పాడైన బోరు.. మూలకు చేరిన కుళాయి

### నీటి సౌకర్యం లేక మధ్యాహ్న భోజన నిర్వహణకు అవస్థలు

**ప్రజాశక్తి - సీలేరు** : సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపు గ్రామ శివారు నున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహణకఉ నానా అవస్థలు పడుతున్నామని పాఠశాల ఉపాధ్యాయులు భగీరథ వెల్లడించారు. ఈ పాఠశాలకు పైపులైన్ ద్వారా నీటి సదుపాయాన్ని కల్పించగా, పైపులైన్ పాడవ్వడంతో తాగునీటి సమస్య తలెత్తింది. పాఠశాల ఆవరణలో ఉన్న బోరు బావి మరమ్మతులకు గురికావడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు సమయానికి పెట్టలేని పరిస్థితి ఏర్పడిందనిఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు దూరంగా ఉన్న సీలేరు నదినుంచి మంచి నీటిని సేకరించి వంటలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారులు , స్థానిక సర్పంచ్ పాంగి. దుర్గో స్పందించి పాఠశాలకు మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.



మరమ్మతులకు గురైన కుళాయి

## జివిఎంసి కౌన్సిల్ అంశాలపై సమీక్ష

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈ నెల 11న జరగబోయే జివిఎంసి సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చించబోయే అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి సర్వసభ్య సమావేశం అజెండాలో పొందుపరిచిన అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సభ్యులు లేవనెత్తిన అంశంపై పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. శాఖల వారీగా సంబంధిత అధికారి అజెండాలోని అంశాలకు వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటంతో పాటు గత కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తిన ప్రశ్నలకు ఇవ్వవలసిన సమాధానంపై కూడా వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ విషయమై అజెండాలోని పొందుపరిచిన ప్రతి అంశంపై సంబంధిత అధికారులతో కమిషనర్ కూలంకుషంగా చర్చించి పూర్తి సమాచారంతో జరుగబోయే జివిఎంసి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఆర్.సోమనారాయణ, ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, జోనల్ కమిషనర్లు 1, 3, 4, 5, 8 ప్రేమ ప్రసన్న వాణి, కె.శివప్రసాద్, ఎమ్.మల్లయ్యనాయుడు, బి.రాము, హేమావతి, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్.రవి, శాంసన్ రాజు, రామ్ మోహనరావు, గోవిందరావు, పివివి.సత్యనారాయణ రాజు, కార్యదర్శి బివి.రమణ, యుసిడి పీడీ పిఎమ్.సత్యవేణి, సిటీ ప్లానర్లు ధనుంజయ రెడ్డి, మీనా కుమారి, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతి రాజ్ పాల్గొన్నారు.



బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

## కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

**ప్రజాశక్తి - విశాఖపట్నం :** అన్ని రంగాల వారికి సహకారం అందించే దిశగా కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ముందుకు సాగుతోందని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 33వ శాఖను నగరంలోని విశాలాక్షినగర్‌లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకు అంటే సహకారమని అన్నారు. నూతన శాఖలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తమ నియోజకవర్గంలో బ్యాంకు నాలుగో శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని రంగాల ఖాతాదారులకు అనువైన సమయంలో బ్యాంకు సేవలను అందిస్తూ, వారి మన్ననలను పొందుతూ బ్యాంకు అభివృద్ధి చెందడం సంతోషకరమన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధికి బ్యాంకుల సహకారం ఎంతగానో అవసరమన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పట్టణ సహకార బ్యాంకులలో ఒకటిగా ఉన్న తమ బ్యాంకు మల్టీ- స్టేట్ హోదాను సాధించే దిశగా ముందుకు సాగుతోందన్నారు. అదే సమయంలో స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా మారాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకు రూ.910 డిపాజిట్లతోనూ, రూ.630 కోట్లు రుణాల మంజూరుతోనూ, రూ.1540 కోట్లు వ్యాపారాన్ని సాగిస్తోందని, రానున్న 2025 మార్చి నాటికి రూ.1000 కోట్లు డిపాజిట్లు చేరుకోవడంతో పాటు, రూ.1800 కోట్లు వ్యాపారాన్ని కూడా చేయాలనే ఆసక్తితో పాలకవర్గం, బ్యాంకు సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంకుల అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, నాఫ్‌కబ్ డైరెక్టర్, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎంఆర్‌కె.రాజు, హిందుస్థాన్ షిప్‌యార్డు కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, జి.రామకష్ణ, కె.శ్యామ్ కిషోర్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.